క్లుప్తంగా

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె : బాట గంగమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం బింభప్రతిష్ట చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా అంకురార్పణ


సీతా లక్ష్మణ సమేత ధ్యానాభిరామస్వామి

బైరెడ్డిపల్లె : మండలంలోని కార్వేటికొండపై వెలసిన శ్రీధ్యానాభిరామస్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం వైభవంగా అంకురార్పణ నిర్వహించారు. ఉదయం సీతా లక్ష్మణ సమేతంగా స్వామివారి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉభయకర్తలుగా రామచంద్రరావు, నాగరాజారావు, నారాయణశెట్టి, వెంకటనరసయ్య, శ్రీనివాసులు, సూర్యనారాయణరెడ్డి, ప్రహ్లాదరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అశోక్‌రెడ్డి వ్యవహరించారు.

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి


ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మతల్లిని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితుల ఆశీర్వాదం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాల మండల కన్వీనర్‌గా మధు



సోమల: సచివాలయాల మండల కన్వీనర్‌గా దిద్దివారిపల్లెకు చెందిన రాశెట్టి మధు(మంజునాథ్) నియమితులయ్యారు. ఆదివారం ఈ మేరకు జిల్లా గృహసారథుల ఇన్‌చార్జి ఉత్తర్వులు జారీ చేశారు. మధు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు.

ఏతూరులో కంటి వైద్యశిబిరం


వైద్యశిబిరంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, నాగరాజారెడ్డి

పుంగనూరు : మండలంలోని ఏతూరు సచివాలయంలో మదనపల్లెకు చెందిన రమా నేత్రాలయ వారు ఆదివారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల వారు ఉచితంగా వైద్యసేవలందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తపల్లె చెంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శివకుమార్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

180 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

కుప్పం : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సాయిమాత సేవా ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరంలో 180 మందికి పరీక్షలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శారదా కంటి ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. 39 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వారికి సోమవారం ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు గిరీష్, మహదేవ్ పాల్గొన్నారు.

టెర్రకోటకు ఆహ్వానం


టెర్రకోట కాలనీలో నిర్మించిన శాలివాహనుడు, మల్లమాంబ విగ్రహాలతోపాటు వినాయకుడి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొనాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కళాకారులు ఆదివారం ఆహ్వానించారు. కార్యక్రమంలో టెర్రకోట కళాకారుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, పార్టీ పట్టణ కన్వీనర్ జాఫర్, కౌన్సిలర్ కోదండరామయ్య ఉన్నారు.
- పలమనేరు

అభ్యున్నతికి అభయం


బీసీల అభ్యున్నతికి ఎల్లప్పుడూ సహకరిస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం బంగారుపాళ్యంలో తనను కలిసిన బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎంఎస్ సలీమ్‌కు ఎంపీ రెడ్డెప్పతో కలిసి నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో సర్మాజీ ఎంఎస్ సాద్, తాజ్‌బాషా, ఎండీ నూర్, అబ్దుల్ రెహమాన్, యుగంధర్ ఉన్నారు.
- పుంగనూరు

అండగా ఉంటాం


సోమల లింగాపురం వీధిలో శనివారం కన్నుమూసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహబూబ్‌బాషా భౌతిక కాయానికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదివారం నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, మునాఫ్, సీఎస్ మునాఫ్, ప్రసాద్ పాల్గొన్నారు.
- సోమల

అర్హులందరికీ ‘నవరత్నాలు’


లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందించి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ


మొరసనపల్లెలో లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- పేదల అభ్యున్నతికే పథకాలు
- ఇంటింటా సంక్షేమ వెలుగులు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్

పెద్దపంజాణి : కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా.. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. ఆదివారం మండలంలోని చిన్నపరెడ్డిపల్లె, దొమ్మరిపాళ్యం, దయాలగడ్డలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. సుమారు 150 ఇళ్లకు వెళ్లి మూడేళ్ల పాలనలో ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని కొనియాడారు. ప్రతి కుటుంబానికి నవరత్నాల ద్వారా ఆర్థిక చేయూతనందిస్తున్నారన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంటు తదితర పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీనే మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యులు సుష్మకీర్తి, పలమనేరు ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్, తహసీల్దార్ హనుంతు, ఎంఈఓ హేమలత, ఏఓ రభీబా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, ఏఎంసీ డైరెక్టర్లు సురేష్, ఎర్రబల్లి శ్రీనివాసులు, సర్పంచ్‌లు సుజాత ధనంజయ, రమేష్ బాబు, మురళి, ఎంపీటీసీ సభ్యులు చంద్రారెడ్డి, మోహన్ రెడ్డి, దనంజయ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, స్థానిక నేతలు రాజారెడ్డి, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లు

శాంతిపురం : సంక్షేమ.. అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. ఆదివారం మండలంలోని మొరసనపల్లె, పాకంపల్లె, నారసింహేపల్లె, జల్లిగానిపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం అప్పులు చేస్తోందని తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి దిమ్మ తిరిగేలా రిజర్వ్ బ్యాంక్ వివరాలను వెల్లడించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి వ్యయం పెరిగిన విషయం ఆర్బీఐ నివేదికలో స్పష్టమైందని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు అధిక నిధుల కేటాయింపుతో గణనీయమైన పురోగతి సాధిస్తోందని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం చేసిన అప్పులు పచ్చ చొక్కాల జేబుల్లోకి పోతే, ఇప్పుడు ప్రతి రూపాయి కూడా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతోందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా మోసిన కుప్పం ప్రజలను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే కుప్పం మున్సిపాలిటీ, రెవెన్యూ డివిజన్ అయ్యిందని గుర్తు చేశారు. అలాగే కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి మొత్తం రూ.160 కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు. మరో నాలుగు నెలల్లో హంద్రీ–నీవా జలాలు కుప్పానికి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు చంగప్ప, సుకుమార్, స్థానిక నేతలు కోదండరెడ్డి, పట్టాభి, వరదరాజులు, విజయకుమార్, మురుగేష్, సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీ సభ్యుడు ఆర్ముగం పాల్గొన్నారు.

రేపటి నుంచి కడపల్లెలో ‘గడప గడపకు’

శాంతిపురం : మండలంలోని కడపల్లెలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హేమమాలిని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ భరత్ పాల్గొనే ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

‘పల్లెబాట’పై నేడు సమావేశం

పులిచెర్ల(కల్లూరు): మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేపట్టనున్న పల్లెబాట కార్యక్రమంపై సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై చర్చించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

పుంగనూరు : భూవివాదంలో దళిత మహిళపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వివరాలు.. మండలంలోని సింగిరిగుంటకు చెందిన ఎస్.అమ్ములుపై ఆదివారం గ్రామానికి చెందిన అప్పిరెడ్డి , ఆయన కుమారులు మురళి, సురేష్ కర్రలతో దాడి చేసి, కులం పేరుతో దూషించారు. దీనిపై బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ మోహన్‌కుమార్ విచారించి అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



ఉపాధ్యాయులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

పుంగనూరు : పట్టణంలోని బసవరాజ హైస్కూల్‌లో 1998–99 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యా బుద్ధులు నేర్పిన గురువులు అయూబ్ ఖాన్, వేణుగోపాల్, ఫైరోజ్‌ఖాన్‌ను ఘనంగా సత్కరించారు. ప్రజలకు సేవలందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తోట గిరిధర్, విజయ్, ముస్తాక్, సుజన, ధనలక్ష్మి, ఆంజమ్మ, సూరి పాల్గొన్నారు.

గిడుగు రామమూర్తికి ఘన నివాళి


గిడుగు చిత్రపటం వద్దర నివాళులర్పిస్తున్న రచయితలు

పలమనేరు : పట్టణ సమీపంలోని కళామందిరంలో ఆదివారం తెలుగు వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి స్ఫూర్తితో భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తెలుగువారిపై ఉందన్నారు. ఆంగ్లం మోజులో పడి మాతృభాషను మరవకూడదని సూచించారు. అమ్మభాష అవసరాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో రచయితలు మాధవరెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, చిరంజీవి, శివశంకర్‌రెడ్డి, పుష్ప, నీలిమ పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీకి రిఫ్లెక్టివ్ టేప్ తప్పనిసరి


సూచనలిస్తున్న చెక్‌పోస్టు ఎంవీఐలు

పలమనేరు : ట్రాక్టర్ ట్రాలీకి తప్పనిసరిగా రిఫ్లెక్టివ్ టేప్ అంటించాలని చెక్‌పోస్ట్ ఎంవీఐలు ఆదేశించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం చెన్నై– బెంగళూరు హైవే పై వెళుతున్న వాహనాల డ్రైవర్లకు నిబంధనల కరపత్రాలను పంపిణీ చేశారు. ముఖ్యంగా ట్రాక్టర్లకు స్టిక్కర్లు అంటించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశముంటుందని హెచ్చరించారు. ఎంవీఐలు భూషణ్ రెడ్డి, అంజనేయప్రసాద్, హరికేశవ్, ఏఎంవీఐ దీపిక పాల్గొన్నారు.

కో–ఆప్షన్ సభ్యుడికి పరామర్శ


మస్తాన్ సాహెబ్‌ను పరామర్శిస్తున్న సుధీర్ రెడ్డి

సోమల: మండల కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్ సాహెబ్‌ను ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి పరామర్శించారు. మస్తాన్‌సాహెబ్ ఈ నెల 8వ తేదీన జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఆయనను పరామర్శించిన సుధీర్‌రెడ్డి తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ నేతలు నాగభూషణంరెడ్డి, శ్రీరాములు, ఖాదర్ బాషా, సురేంద్ర, ఐలా సూరి, బాషా, జబ్బార్ సాహెబ్ పాల్గొన్నారు.

జోరుగా ఎడ్ల పందేలు


గిత్తను నిలువరించేందుకు పోటీపడుతున్న యువకులు

సోమల : సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం పెద్ద ఉప్పరపల్లెలో జోరుగా ఎడ్ల పందేలు నిర్వహించారు. పశువులను ముస్తాబు చేసి పరుగులెత్తించారు. ఎడ్లను నిలువరించేందుకు యువత పోటీ పడ్డారు. ఈ క్రమంలో ముగ్గురు గాయపడ్డారు. ఇన్‌చార్జి ఎస్ఐ మారుతి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, సర్పంచ్ భారతి, ఎంపీటీసీ సభ్యులు రజియా, నేతలు గణపతి, జిలానీ పాల్గొన్నారు.

మార్లపల్లె చర్చిలో..

పుంగనూరు : మార్లపల్లె చర్చిలో కొత్త సంవత్సరం, సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పశువులను అలంకరించి ఊరేగింపుగా చర్చి వద్దకు తీసుకువచ్చారు. ఫాదర్ విల్సన్‌రెడ్డి ప్రార్థనలు చేశారు. కాటమరాజు గుడి వద్ద చిట్లా కుప్పను అంటించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజప్ప, గ్రామస్తులు మోహన్‌రెడ్డి, నాగభూషణం, శంకర్‌రెడ్డి, శంకర, ఆంటోని రాజ్, హరినాథరెడ్డి, రంగ, అంజిరెడ్డి పాల్గొన్నారు.

‘పీపీఎస్’ సేవలు ప్రశంసనీయం

- పలమనేరు పరిరక్షణ సమితి ఆరవ వార్షికోత్సవంలో వక్తలు
- పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర


సేవాపురస్కారం అందిస్తున్న చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ తదితరులు

పలమనేరు : పట్టణంలోని సమస్యలను పరిష్కరించేందుకు అలుపెరుగని కృషి చేస్తున్న పలమనేరు పరిరక్షణ సమితి (పీపీఎస్) సభ్యుల సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ కొనియాడారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సమితి ఆరో వార్షికోత్సం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పీపీఎస్‌లో ఉద్యోగ విరమణ పొందిన వారు ఎందరో ఉన్నారని, వారు విశ్రాంతి తీసుకోకుండా ఈ వయసులో కూడా ప్రజా సేవలో నిమగ్నం కావడం అభినందనీయమన్నారు. పురపాలక సంఘంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లోనూ పీపీఎస్‌కు అండగా నిలబడతామని వెల్లడించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల గజేంద్రప్రసాద్, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు కృష్ణమూర్తిరెడ్డి, గోవిందధామం ట్రస్టు నిర్వాహకులు సిద్ధయ్య, తులసీనాథం నాయుడు తదితరులు ప్రసంగించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన కాప్పల్లి రవీంద్రారెడ్డి, శ్రీధర్, జీలు, సోమచంద్రారెడ్డి, మహమూద్, జయచంద్ర, మనోహర్‌గుప్త, జయపాల్ తదితరులకు ఉత్తమ సేవాపురష్కారాలు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యంపిళ్లై, నరసింహులు, ఎన్జీఓ నేత ఆనంద్‌బాబు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన తాతయ్య ఈ సందర్భంగా జాతీయనాయకుల చిత్రపటాలను పలువురికి బహూకరించారు.